క్లుప్తంగా

క్విజ్ పోటీల్లో శ్రీప్రకాష్ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన శ్రీ ప్రకాష్ విద్యార్థులు

పాయకరావుపేట : భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో గౌతమి లైబ్రరీ రాజమహేంద్రవరంలో ఆదివారం నిర్వహించిన రీజనల్ భారత్ కో జానో క్విజ్ పోటీల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ బహుమతులు కైవసం చేసుకున్నారు. జూనియర్ విభాగంలో అజితేష్ త్రిపాఠి 8 వ తరగతి, గణేష్ పార్థు 7వ తరగతి ప్రథమ బహుమతి సాధించి ఈ నెల 26 వ తేదీన విశాఖపట్నంలో జరగబోయే రీజనల్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సీనియర్స్ విభాగంలో 10వ తరగతి విద్యార్థినులు ఆర్.లలిత శరణ్య, హర్షిత ద్వితీయ స్థానాన్ని సాధించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కొవ్వూరు ఆర్డీవో ఎస్.మల్లిబాబు మాట్లాడుతూ విద్యార్థుల మేధా సంపత్తికి ఇటువంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు.

బీఎల్‌వోలు బాధ్యతగా పనిచేయాలి

మునగపాక : ఓటరు జాబితాల్లో తేడాలు సవరించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మనోరంజని కోరారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం బీఎల్‌వోలతో ఆమె సమావేశమయ్యారు. ఓటరు జాబితాలకు సంబంధించిన తప్పులను సరి చేయాలన్నారు. ఇంటింటికీ వెళ్లి ఓటరు వివరాలు నమోదు చేయాలన్నారు. తహసీల్దార్ వినయ్‌కుమార్, పలువురు బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ఒంపోలులో ఉపాధి గ్రామసభ

మునగపాక : ప్రతి ఒక్కరూ ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీవో ఎరకయ్య కోరారు. ఒంపోలులో సోమవారం ఉపాధి హామీ పథకం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పథకంలో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఈ ఏడాది రూ.62లక్షలతో పనులు చేపట్టామన్నారు. నూతనంగా చేపట్టనున్న పనులకు గ్రామసభలో తీర్మానం చేసి ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సూరిబాబు, వైఎస్సార్‌సీపీ నేతలు బొద్దపు శ్రీరామమూర్తి, ద్వారం జానకీరామ్, పంచాయతీ కార్యదర్శి రమణ పాల్గొన్నారు.

ఉప విద్యాశాఖాధికారిగా అప్పారావు



బాధ్యతలు చేపట్టిన అప్పారావు

యలమంచిలి : యలమంచిలి ఇన్‌ఛార్జి ఉప విద్యాశాఖాధికారిగా ఎస్.రాయవరం ఎంఈవో పి.అప్పారావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎస్.ప్రేమ్‌కుమార్ మన్యం జిల్లా ఇన్‌చార్జి ఉప విద్యాశాఖాధికారిగా నాలుగు నెలల కిందట వెళ్లారు. అప్పటి నుంచి అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారిణి వెంకటలక్ష్మమ్మ ఇంఛార్జిగా ఇప్పటి వరకు కొనసాగారు. తాజాగా ఎస్.రాయవరం మండలం ఎంఈవో అప్పారావుకు ఉన్నతాధికారులు అదనపు బాధ్యతలు అప్పగించారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



పేట బయ్యవరంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

యలమంచిలి : పేట బయ్యవరం పాఠశాలలో విద్యార్థులకు రేగుపాలెం పీహెచ్‌సీ వైద్యబృందం ఆధ్వర్యంలో రక్త నమూనా పరీక్షలు చేశారు. పాఠశాలలో 123 మంది విద్యార్థులకు రక్తహీనత, హెచ్.బి పరీక్షలు నిర్వహించి ఐరన్ శాతం తగ్గిన విద్యార్థులకు మందులు అందజేశారు.

గ్రామకంఠాన్ని విడిపించరూ..

కోటవురట్ల: అన్యాక్రాంతమైన గ్రామకంఠాన్ని స్వాధీనం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ కిల్లాడ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆయన సోమవారం ఆందోళన నిర్వహించారు. రామాలయం పక్కనే గ్రామకంఠం ఉందని, ఆ స్థలంలో రామాలయం ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఉపయోగించేవారమన్నారు. ఆ స్థలాన్ని ఇటీవల ఓ వ్యక్తి ఆక్రమించుకున్నాడని దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్థలాన్ని స్వాధీనం చేసుకుని రామాలయానికి అప్పగించాలని కోరారు.



ఆరోగ్య మస్తు..



- చెంతనే వైద్యం..ఇంటింటా ఆరోగ్యం
- పేదల పెన్నిధిగా ప్రభుత్వాస్పత్రులు
- పూర్తి స్థాయిలో సిబ్బంది, మందులు
- వైద్య రంగానికి జగనన్న ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేసింది. ప్రభుత్వాస్పత్రుల్లో పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించి, మౌలిక వసతులు కల్పించి పేదల ఆరోగ్యానికి భరోసా ఇస్తోంది. ఒకప్పుడు మందులకూ దిక్కులేని చోట నేడు కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తూ పేదల పెన్నిధిగా సర్కారు ఆస్పత్రి అండగా నిలుస్తోంది.

పాయకరావుపేట : మండలంలో గల ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు మెరుగైన సేవల్ని వైద్య సిబ్బంది అందిస్తున్నారు. మండలంలో పాయకరావుపేట, శ్రీరాంపురం, మండవరం గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. మండలంలో గల 24 గ్రామాల పరిధిలోను ప్రజలకు మెరుగైన వైద్య సేవలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా అందిస్తున్నారు. పట్టణంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గతంలో నూతన భవనం లేకపోవడం వల్ల ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక పీహెచ్‌సీల్లో మౌలిక సదుపాయాలు అభివృద్ధి పరచడంతో పాటు అవసరమైన వైద్యులను నియమించడం జరిగింది. అంతేకాకుండా పూర్తిస్థాయిలో మందులు అందుబాటులో ఉంటున్నాయి.

- ప్రస్తుత సంవత్సరం పట్టణంలో రూ. కోటి 57 లక్షలతో నూతనంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించారు.
- ఇక్కడ ఇద్దరు వైద్యులు వైద్య సేవలు అందిస్తున్నారు. రోగులకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందిస్తున్నారు.
- పట్టణంలో గల పీహెచ్‌సీకి ప్రతి నిత్యం 120 మంది వరకు రోగులు వచ్చి వైద్య సేవలు పొందుతున్నారు.
- శ్రీరాంపురం పీహెచ్‌సీలో కూడా ఇద్దరు వైద్యులు వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రతి రోజు 100 మంది రోగులు వైద్య సేవలు పొందుతున్నారు.
- మంగవరం పీహెచ్‌సీలో ప్రతిరోజు 100 మందికి వైద్య సేవలు అందిస్తున్నారు. గతంలో కంటే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రోగులకు మరింత వైద్య సేవలు అందుతున్నాయి. ప్రతి నిత్యం రోగులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందిస్తున్నారు. ముఖ్యంగా గర్భిణులకు ప్రత్యేకంగా వైద్య పరీక్షలు, వైద్య సేవలు, ఆరోగ్య సూచనలు అందిస్తున్నారు.



పట్టణంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



రోగికి రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



రోగికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టరు

రోగులకు ఎంతో భరోసా



పాయకరావుపేట పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది వైద్యం బాగా అందిస్తున్నారు. ఏ సమయంలో వెళ్ళినా సరే వైద్య సేవలు లభిస్తున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు పూర్తిస్థాయిలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. అదే విధంగా రాత్రి సమయంలో కూడా ఎవరికి ఏవిధమైన అనారోగ్య సమస్యలు ఉన్నా పీహెచ్‌సీ అందుబాటులో ఉందన్న భరోసా కలుగుతోంది.

–చందక లోవరాజు, నామవరం

ఖర్చు లేకుండా ప్రసూతి సేవలు



మా అమ్మాయికి పీహెచ్‌సీలోనే ప్రసూతి సేవలు అందించారు. ఇక్కడి వైద్య సిబ్బంది రాత్రి, పగలు చాలా బాగా వైద్య సేవలు అందిస్తున్నారు. ఎప్పటికప్పుడు రోగులను పరీక్షించి, మందులు అందిస్తున్నారు. ప్రైవేట్ ఆస్పత్రిలో డెలివరీ చేయాలంటే ఖర్చుతో కూడిన పని, కానీ ఇక్కడ ఏవిధంగా ఖర్చు లేకుండా మా అమ్మాయి డెలివరీ చేసారు. డెలివరీ జరిగి 11 రోజులైంది. ప్రస్తుతం తల్లి, బిడ్డ ఇంటి వద్ద క్షేమంగా ఉన్నారు. ఆరోగ్య శ్రీ ద్వారా నగదు కూడా అందనుంది. చాలా సంతోషంగా ఉంది.

–ఈరుగుల పార్వతి, పాయకరావుపేట

జాతరలా...యాత్ర



సభకు పెద్ద సంఖ్యలో హాజరైన మహిళలు





సభలో మాట్లాడుతున్న ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే కన్నబాబు

అచ్యుతాపురం(అనకాపల్లి)/యలమంచిలి/రాంబిల్లి: సామాజిక సాధికార బస్సు యాత్రకు జనం బ్రహ్మరథం పట్టారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు, జగనన్న అభిమానులతో యలమంచిలి–అచ్యుతాపురం రహదారి కిక్కిరిసింది. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి వచ్చి పార్టీ శ్రేణులు, అభిమానులతో పోలీసు క్రీడామైదానం నిండిపోయింది. బీసీలకు పట్టాభిషేకం చేసిన ఈ ప్రభుత్వానికి అండగా ఉంటామంటూ మహిళలు,యువకులు స్వచ్ఛందంగా బస్సు యాత్రకు స్వాగతం పలికారు. చిరు చినుకుల్లో సభావేదిక వద్ద భారీ జనసందోహం జాతరను తలపించింది. కార్యక్రమాల్లో ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే కన్నబాబు, మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, జెడ్పీటీసీలు లాలం రాంబాబు, రాము, కోన లచ్చన్నాయుడు, పెంటకోట సోము సత్యనారాయణ, నాగరాజు, సోము, జిల్లా అధికార ప్రతినిధి పిన్నమరాజు వాసు, యలమంచిలి పట్టణ అధ్యక్షుడు ఎర్రయ్యదొర, పార్టీ మండల అధ్యక్షులు అచ్చెంనాయుడు(మునగపాక), అధ్యక్షుడు కిశోర్(రాంబిల్లి) యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, మున్సిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, అర్రెపు సత్యగుప్తా, అచ్యుతాపురం జేసీఎస్ కన్వీనర్ రాజాన విజయ్ కుమార్, కో ఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్, పార్టీ మండల నాయకులు దేశంశెట్టి శంకరరావు, జయలక్ష్మి, కోన సంజయ్, శ్రీనుబాబు పాల్గొన్నారు.



సామాజిక సాధికార బస్సుయాత్రకు తరలివెళుతున్న సిరసపల్లి వైఎస్సార్‌సీపీ శ్రేణులు



సభా వేదిక వద్ద ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



సాధికార యాత్రలో ఉత్సాహంగా పార్టీ శ్రేణుల బైక్‌ర్యాలీ

దారులన్నీ అచ్యుతాపురం వైపే...

మునగపాక : అచ్యుతాపురంలో సోమవారం నిర్వహించిన సామాజిక సాధికార బస్సుయాత్రకు మండలం నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు ఇచ్చిన పిలుపు మేరకు పార్టీ శ్రేణులు బైక్‌లు, ఆటోలపై ర్యాలీగా వెళ్లారు.జై జగన్.. అంటూ నినాదాలు చేసుకుంటూ ఉత్సాహంగా బస్సుయాత్రకు పయనమయ్యారు. మండలంలోని టి.సిరసపల్లిలో సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి నాగప్పారావు సారథ్యంలో పెద్దసంఖ్యలో కార్యకర్తలు పయనమయ్యారు.

మార్మోగిన శివనామస్మరణ



లింగరాయి గుడిలో కుంకుమ పూజలు



సాంబశివుని ఆలయంలో విభూది అభిషేకం



ఉపమాకలో స్వామివారికి అభిషేకం

మునగపాక : మండల వ్యాప్తంగా పలు శివాలయాలు సోమవారం భక్తులతో కిటకిటలాడాయి. శివ నామస్మరణతో శివాలయాలు మార్మోగాయి. కార్తీకమాసం తొలి సోమవారం కావడంతో ఆలయాలకు భక్తుల తాకిడి పెరిగింది. వాడ్రాపల్లిలోని దక్షిణేశ్వరున్ని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ చైర్మన్ పరమేశ్వరరావు భక్తులకు సదుపాయాలు కల్పించారు. మునగపాక మెయిన్‌రోడ్డులోని లింగరాయి గుడిలో కుంకుమ పూజలకు విశేష స్పందన వచ్చింది. సాంబశివుని ఆలయంలో విభూది అభిషేకం జరిపారు.
నక్కపల్లి: ఉపమాకలో శ్రీ భువనేశ్వరి సమేత లక్ష్మణేశ్వరస్వామి ఆలయంలో సోమవారం తెల్లవారు జామున రెండుగంటలకు స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయంలో ఉన్న నవగ్రహాలకు, ధ్వజస్తంభం వద్ద దీపారాధన చేసి స్వామివారిని దర్శించుకున్నారు. గొడిచర్లలో శేషలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ రెడ్డిరామకృష్ణ దంపతుల ఆధ్వర్యంలో అన్న సమారాధన జరిపారు.
మునగపాక : రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావాలని కోరుతూ మునగపాకకు చెందిన వలంటీర్ దాడి కోటిబాబు సోమవారం వాడ్రాపల్లి దక్షిణేశ్వరునికి పూజలు నిర్వహించారు.

జనమంతా జగనన్న పాలనే కోరుకుంటున్నారు...



పథకాల ఫ్లెక్సీ ఆవిష్కరిస్తున్న నర్సింహమూర్తి

నక్కపల్లి: రాష్ట్ర ప్రజలు మరో సారి జగనన్నే ముఖ్యమంత్రికావాలని కోరుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి అన్నారు. సోమవారం నక్కపల్లిలో వై ఏపి నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయం వద్ద జగనన్న ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత నాలుగున్నరేళ్లలో చేపట్టిన అభివృద్ధికార్యక్రమాల వివరాల ఫ్లెక్సిని ఆవిష్కరించారు. అనంతరం పార్టీ కార్యలయం వద్ద పార్టీ జెండా ఆవిష్కరించారు. నాలుగున్నరేళ్లలో ఎన్నికల ముందు ఇచ్చిన హమీలన్నింటిని నెరవేర్చిన ప్రభుత్వంగా చరిత్రలో నిలిచిపోయిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ నానాజీ, సర్పంచ్ రత్నకుమారి, పీఏసీఎస్ అధ్యక్షుడు తాతబాబు, ఉపసర్పంచ్ వీసం నానాజీ, నాయకులు కొండ, బంగార్రాజు, సత్తిబాబు పాల్గొన్నారు.

సీతారాములకు శతమానం బహూకరణ



మూలపేట సీతారాముల ఆలయానికి రెండు తులాల శతమానం అందజేస్తున్న భక్తులు

మునగపాక: మూలపేటలో సీతారాముల ఆలయానికి అనకాపల్లికి చెందిన ఆడారి వెంకట సూర్య అప్పారావు రెండు తులాల శతమానం అందజేశారు. సోమవారం రామాలయ కమిటీ ఉపాధ్యక్షుడు బొడ్డేడ ఆదికుమార్‌కు శతమానం అందజేసి భక్తిని చాటుకున్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం పాలన



పెదరామభద్రపురంలో సంక్షేమం, అభివృద్ధి ఫ్లెక్సీని ప్రారంభించిన చిక్కాల రామారావు



సంక్షేమ పథకాల ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న అధికారులు

పాయకరావుపేట : రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు అన్నారు. మండలంలో గల పెదరాంభద్రపురం గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే...అనే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బడుగు, బలహీన వర్గాలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. పెదరాంభద్రపురం, కొత్తూరు గ్రామాలకు సంక్షేమం, అభివృద్ధి కోసం మంజూరు చేసిన రూ. 32 కోట్ల వివరాలతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని ప్రారంభించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, జెడ్పీటీసీ సూరిబాబు, ఎంపీపీ పార్వతీ తాతారావు, పీఏసీఎస్ చైర్మన్ రాజేష్ ఖన్నా, సర్పంచ్‌లు కోడ కోటేశ్వరావు, బాబ్జి, గెడ్డమూరి శ్రీనివాసరావు, సకిలేటి రాము, పెదరాంభద్రపురం సర్పంచ్ గంపల సత్తిబాబు, ఎంపీటీసీ వెంకటలక్ష్మి చక్రవర్తి, ఎంపీటీసీలు శేఖర్, నరేష్ పాల్గొన్నారు.
ఎస్.రాయవరం : ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరికి చేర్చడంలో సచివాలయ సిబ్బంది,గ్రామ వలంటీర్లు కీలక పాత్ర పోషించాలని ఈవోపీఆర్డీ సత్యనారాయణ సూచించారు. కొరుప్రోలు సచివాలయ పరిధిలో గడిచిన నాలుగున్నరేళ్లలో లబ్ధిదారులకు అందించిన సంక్షేమ పథకాలు వివరాలు ఫ్లెక్సీని ఈవోపీఆర్డీ ఆవిష్కరించారు. సర్పంచ్ సూరివేణి పాల్గొన్నారు.

పుస్తక పఠనం ద్వారా మేధో వికాసం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ గోవింద్



పాయకరావుపేటలో విజేతలకు బహుమతులు

యలమంచిలి : గ్రంథాలయాల్లో పుస్తక పఠనం ద్వారా మేధోసంపత్తి పెరుగుతుందని ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. సోమవారం యలమంచిలి శాఖాగ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.
పాయకరావుపేట : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, సీఐ పి.అప్పలరాజు చేతుల మీదుగా విజేతలకు బహుమతులు, మెమెంటోలు అందించారు.
నక్కపల్లి : పెద బోదిగల్లం పాఠశాలలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ సత్యనారాయణ, సహాయ ప్రధానోపాధ్యాయురాలు కుమారి, విశ్రాంత గ్రంథాలయాధికారి మూర్తి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో ముగింపు కార్యక్రమంలో బండారు చారిటబుల్ ట్రస్ట్ వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.
రాంబిల్లి: దిమిలి శాఖా గ్రంథాలయంలో సోమవారం వారోత్సవాలు ముగిసాయి. వారం రోజుల పాటు విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్పంచ్ బంగారు చిలుకు, ఉప సర్పంచ్ నగిరెడ్డి మురళీకృష్ణ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ ఎస్.శకుంతల, మాజీ సర్పంచ్ ప్రసాద్ పాల్గొన్నారు.
మునగపాక : విద్యార్థులు ఏకాగ్రతతో పాటు క్రమశిక్షణతో చదువుకుంటే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని ఎంఈవో శివనాయుడు పేర్కొన్నారు. మునగపాక, గణపర్తి శాఖా గ్రంథాలయాల్లో వారం రోజులుగా నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన విజేతలకు సోమవారం బహుమతులు అందజేశారు. గ్రంథాలయ అధికారి రమణ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. గణపర్తిలో శాఖా గ్రంథాలయాధికారి అప్పలనరసమ్మ ఆధ్వర్యంలో విజేతలకు బహుమతులు అందజేశారు.
కోటవురట్ల : గ్రంథాలయాలు ప్రతి వ్యక్తిని ఉన్నత స్థాయికి చేర్చేందుకు దోహదపడతాయని మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు అన్నారు. శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ పోటీలలో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. జెడ్పీటీసీ ఉమాదేవి, ఎంఈవో శ్రీజోష్, వైఎస్సార్‌సీపీ నాయకుడు సత్యనారాయణ పాల్గొన్నారు.